క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్స్‌గా మూడు యూపీ స్కూళ్లు

కోట: మండలంలో చెందోడు, ఉత్తమనెల్లూరు, ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలను వాటి స్థాయిని పెంచి జెడ్పీ హైస్కూళ్లుగా మార్చుతున్నట్లు ఎంఈఓ మస్తానయ్య మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదుల ఏర్పాటు, ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు తెలిపారు. దీంతో మండలంలో జెడ్పీ హైస్కూల్స్ సంఖ్య 11కు చేరుతుందన్నారు.

మాల్లాం, కోగిలిలో స్క్రీనింగ్ పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు: మండలంలోని మల్లాం, కోగిలి గ్రామాల్లో మంగళవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాలతో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు పింక్ బస్సులు ద్వారా మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతంగా చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు పరీక్షలు చేసుకునేందుకు ఆశక్తి చూపుతున్నారన్నారు. పింక్ బస్సులో పురుషులకు నోటి కేన్సర్, మహిళలకు రొమ్ము కేన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారన్నారు. మల్లాం పీహెచ్‌సీ వైద్యుడు మదన్‌మోహన్, స్విమ్స్ మెడికల్ అధికారులు చైతన్య, భాను, డాక్టర్ హరిత, పద్మావతి, వైద్యసిబ్బంది, సర్పంచులు దీనబంధు, పోలయ్య పాల్గొన్నారు.

లోఓల్టేజీ రాకుండా చర్యలు


ఫీడర్లను ప్రారంభిస్తున్న ఈఈ, డీఈ

నాయుడుపేటటౌన్: డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి విద్యుత్ సబ్ డివిజన్లలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఈఈ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో లోఓల్టేజీ సమస్యలు రాకుండా తుమ్మూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ఫీడర్లను ఈఈ మంగళవారం ప్రారంభించారు. నాయుడుపేట డీఈ వరప్రసాద్ రెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ వేణుగోపాల్, ఏఈ సుధాకర్‌నాయుడు, ప్రాజెక్టు మేనేజర్ రహీం, ఏఈలు శివశంకర్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పొర్లుకట్టను నిర్మించాలని వినతి

దొరవారిసత్రం: వరదల సమయంలో బురదమడుగు పరిధిలోని ఎస్సీ కాలనీ మునిగిపోకుండా పొర్లుకట్ట నిర్మించి కాపాడాలంటూ కాలనీ వాసులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో మొర పెట్టుకున్నారు. బురదమడుగు గ్రామ పరిధిలో పొర్లు కట్ట సమస్యపై ఎమ్మెల్యే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి మంళవారం పరిశీలించారు. తహసీల్దార్ శైలకుమారి, ఇరిగేషన్ ఆనంద్‌బాబు, ఏఈ హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులనాయుడు, నేతలు నాగేంద్రనాయుడు, విజయ్, జకరయ్య, షబ్బీర్ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో సూళ్లూరుపేట విద్యార్థి ఆత్మహత్య


సుభాష్ (ఫైల్)

సూళ్లూరుపేట: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సూళ్లూరుపేటకు చెందిన విద్యార్థి చెంబేటి సుభాష్ (20) బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు సూళ్లూరుపేటలోని సుభాష్ తల్లిదండ్రులు చెంబేటి రవి, లక్ష్మీకి సమాచారం అందించారు. మృతదేహాన్ని మంగళగిరి ఎన్నారై మార్చురీకి తరలించారు. కుమారుడి మరణవార్త వినగానే కుప్పకూలిన తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించనున్నారు.


కోటలోని ఎస్ఎల్‌జీఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాల


విలీనం వద్దంటూ ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉత్తమనెల్లూరుకు చెందిన తల్లిదండ్రులు

మండలంలో ప్రస్తుతం పాఠశాలలు, విద్యార్థులు		
ప్రాథమిక పాఠశాలలు	60	1,569
ప్రాథమికోన్నత పాఠశాలలు	4	434
జెడ్పీ హైస్కూల్స్	8	2,453
విలీన ప్రతిపాదనలు		
ఫౌండేషన్ స్కూల్స్	34	
బేసిక్ ప్రైమరీ స్కూల్స్	9	
మోడల్ ప్రైమరీ స్కూల్స్	21	

మూతబడి

- ప్రభుత్వ బడులపై విలీనం కత్తి
- ప్రాథమిక విద్య నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర
- వ్యతిరేకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- విద్యార్థులకు దూరం కానున్న ప్రభుత్వ బడులు

కోట: ప్రభుత్వ బడులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. నూతన విద్యావిధానం పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను తగ్గించేందుకు ప్రతిపాదనలు చేయడాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. సంస్కరణల పేరుతో ఫౌండేషన్ స్కూళ్లుగా గుర్తించబడిన ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసి ఫౌండేషన్ స్కూళ్లలో తొలగించిన తరగతులను ఇందులో కలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశంగా మారడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

చదువులకు దూరమయ్యే ప్రమాదం..

మండలంలో 60 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 34 ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చే విధంగా సిద్ధం చేస్తున్నారు. 60 మంది విద్యార్థులు ఉన్న స్కూళ్లను మోడల్ స్కూల్‌గా గుర్తించనున్నారు. ప్రతి పంచాయతీలో ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసి ఫౌండేషన్ స్కూళ్లలో తొలగించిన 3,4,5 తరగతులను వీటిలో కలుపుతారు. 60మంది కన్నా తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా నిర్ణయించి యథావిధిగా కొనసాగిస్తారు. అయితే ఫౌండేషన్ స్కూళ్లలో తొలగించే 3,4,5 తరగతుల విద్యార్థులు ఎక్కడైతే మోడల్ స్కూల్ ఏర్పాటు అవుతుందో అక్కడకు వెళ్లి చదువుకోవాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అంతేగాక ప్రస్తుతం ఉన్న యూపీ స్కూళ్లు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఈ స్కూళ్లలోని 6,7,8 తరగతులను జెడ్పీ హైస్కూళ్లలో విలీనం చేయనున్నారు. ఈ తరగతుల విద్యార్థులు జెడ్పీ హైస్కూళ్లు ఎంతదూరంలో ఉన్నా అక్కడికి వెళ్లి చదువుకోవాల్సి ఉంది.

వ్యతిరేకిస్తున్న తల్లిదండ్రులు

అయితే ఈ విధానానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు తగినట్లుగా లేవని కొన్ని పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే తెలుస్తోంది. కోట శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను శ్యాంసుందరపురం పాఠశాలలో విలీనం చేయాలని నిర్ణయించారు. రెండు కిలోమీటర్ల దూరం పిల్లలను పంపలేమంటూ తల్లిదండ్రులు ఇటీవల పాఠశాల ముందు ఆందోళన చేశారు. అలాగే నార్త్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను జరుగుమల్లి పాఠశాలలో కలపాలని ప్రతిపాదించారు. దీన్ని వ్యతిరేకిస్తూ స్వయానా కోటకు చెందిన టీడీపీ నేతలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉత్తమనెల్లూరు ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను కర్లపూడి సెంటర్ వద్ద పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎంసీ కమిటీతో పాటు తల్లిదండ్రులు ఇటీవల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇలాగే మండలంలో పలుచోట్ల తరగతుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు కొనసాగుతున్నాయి. పేద పిల్లలు, ముఖ్యంగా గిరిజనులు 1 లేదా 2 కిలోమీటర్ల దూరంలో ఉండే స్కూళ్లకు పంపలేమంటున్నారు. ఇళ్ల చెంత ఉంటున్న ఫౌండేషన్ స్కూళ్ల నుంచి పిల్లలను మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల విలీనం కార్యరూపం దాల్చితే డ్రాపౌట్స్ భారీగా పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులే చెబుతుండడం ఆందోళన కలిగిస్తుంది.

విలీనంపై పునరాలోచించాలి..



ఉత్తమనెల్లూరు పాఠశాలలోని 3,4,5 తరగతులను కర్లపూడి సెంటర్ వద్ద ఉన్న పాఠశాలలో విలీనం చేస్తామని చెబుతున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎంసీ కమిటీ తీర్మానం చేసి అధికారులకు అందజేశాం. మెయిన్‌రోడ్డు దాటుకుని బ్యాగులు మోసుకుంటూ విద్యార్థులు కిలోమీటరు దూరం వెళ్లాలంటే కష్టమే. విలీనంపై అధికారులు పునరాలోచించాలి.

పద్మ, ఎస్ఎంసీ చైర్మన్, ఉత్తమనెల్లూరు

అంతదూరం పంపలేం..



ఊళ్లో ఉన్న పాఠశాలను వదిలేసి అంతదూరం పిల్లలను పంపాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు ఇక్కడే అన్ని తరగతులు ఉన్నాయి. విలీనం పేరుతో చిన్న పిల్లలను ఇబ్బందులు పెట్టడం సరికాదు. రోజూ కిలోమీటరు దూరం నడిచి వెళ్లి రావాలంటే కష్టం. ఇలాగైతే బడికి పంపం.

సురేఖ, విద్యార్థి తల్లి, ఉత్తమనెల్లూరు

నాణ్యమైన విద్యకు అవకాశం..



నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. తక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లోని 3,4,5 తరగతులను పంచాయతీ పరిధిలోని ఒకే పాఠశాలలో విలీనం చేస్తాం. అక్కడ అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించి బోధన చేస్తాం. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. తల్లిదండ్రులు సహకరించాలి.

మస్తానయ్య,ఎంఈఓ,కోట

వృద్ధాశ్రమానికి వితరణ


ఆశ్రమ నిర్వాహకులకు నగదు అందిస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమానికి మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒట్టూరు కిషోర్‌యాదవ్, కుమార్తె కీర్తి రెండు బస్తాల బియ్యం, పండ్లు, నగదు వితరణగా అందజేశారు. ఆశ్రమ స్లాబ్ నిర్మాణానికి కూడా తన వంతు సాయం అందిస్తామని కిషోర్ యాదవ్ హామీ ఇచ్చారు. దాతకు ఆశ్రమ నిర్వాహకులు సునీతా బెన్ని కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఈసీఈ విభాగం విద్యార్థులు వసంత్‌రెడ్డి, గోపి, క్రిష్ణ కుమార్ అన్నాయూనివర్సిటీ, చెన్నై నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఏఐ సొల్యూషన్స్ ఫర్ సస్టైనబుల్ ఎలక్ట్రానిక్స్ అండ్ సిస్టమ్స్ అనే అంశంపై వారిచ్చిన ప్రెజెంటేషన్‌కు అవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా వారిని కళాశాలలో అభినందించారు. హెచ్‌ఓడీ హరనాథ్‌రెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

అక్కగారిపేటలో విషాదం


శ్రీనివాసులు (ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేట గ్రామానికి చెందిన బుడతొట్టి శ్రీనివాసులు(38) తిరుపతిలో మంగళవారం ప్రమాదవశాత్తు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలోని దళిత వాడకు చెందిన శ్రీనివాసులు ప్రతిరోజూ తిరుపతికి వెళ్లి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈక్రమంలో తిరుపతిలోని కరకంబాడి రోడ్డులో బహుళ అంతస్థు భవన నిర్మాణం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. మృతునికి భార్య ప్రమీల, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు: మండలంలోని ఎల్లసిరి వడ్డికండ్రిగ గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్ మంగళవారం పరిశీలించారు. సాక్షి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'అభివృద్ధికి ఆమడ దూరం' అనే శీర్షికకు ఎంపీడీఓ మనోహర్ గౌడ్ స్పందించారు. విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్‌కు తెలియజేశారు. దీంతో డీఈ, ఏఈ, పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో తాగునీటి సమస్యపై ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గతంలో వేసిన బోరులో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు సక్రమంగా రావడం లేదని గుర్తించామన్నారు. గ్రామ సమీపం పొలాల వద్ద భూగర్భ జలాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. వెంటనే కొత్తగా బోరు వేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.


తాగునీటి ట్యాంక్, బోరును పరిశీలిస్తున్న అధికారులు

రైతులకు న్యాయం చేయాలి

సూళ్లూరుపేట: శ్రీసిటీ పారిశ్రామికవాడ విస్తరణకు మలి విడతగా జరుగుతున్న భూసేకరణ విషయంలో భూమి అనుభవంలో వున్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ రవికుమార్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2013 సంవత్సరం భూసేకరణ చట్టం ప్రకారం పరిహారాన్ని సన్న, చిన్నకారు రైతులకు న్యాయబద్ధంగా చెల్లించాలన్నారు. సత్యవేడు మండలం ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్న ఈటిపాకం, రాళ్లకుప్పం రెవెన్యూ గ్రామాల్లో భూముల రికార్డుల్లో కొంత తేడాలున్నాయని, ఈ కారణంగా రైతులు పరిహారం పొందలేని పరిస్థితులు వున్నాయని అన్నారు. రెవెన్యూ నిష్పక్షపాతంగా రికార్డులను సరిచేసి భూమి అనుభవంలో వున్న ప్రతి రైతును గుర్తించి న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెలుగు రమేష్, రైతులు ఎం సత్యనారాయణ, డి.వేణుగోపాల్, జె. శ్రీనివాసులు, ఏ.నాగరాజు పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ

చిల్లకూరు: గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరుకు చెందిన చేవూరు కుటుంబాన్ని మంగళవారం గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. చెన్నూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత చేవూరు విజయమోహన్‌రెడ్డి పిన్నమ్మ చేవూరు సుగుణమ్మ (70) అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలిసి ఎమ్మెల్సీ మురళీధర్ వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

వెంకటగిరిలో నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను పరామర్శించారు. 7వవార్డు ఎన్టీఆర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ నేత రోసిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. పలుగోడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఆదిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో పట్టణంలోని ఏకేఆర్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుని మల్లికార్జున్‌రెడ్డి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాంపాళెం 25వ వార్డు కౌన్సిలర్ సుభావలి, సురేష్ కుమారుడు అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చాతుర్య క్రాంతిని పరామర్శించారు. అదేవిధంగా పట్టణంలోని న్యాయవాది సాయి వరప్రసాద్ కుమారుడు రవితేజ ఇటీవల అమెరికాలో మృతిచెందడంపై బాబ్జి నివాసం వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.


చాతుర్య క్రాంతిని పరామర్శిస్తున్న నేదురుమల్లి

బైక్ బోల్తా: వ్యక్తికి గాయాలు

బాలాయపల్లి(సైదాపురం): బైక్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బాలాయపల్లి మండలంలోని కడగుంట–నిండలి మార్గంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..వెంకటగిరి మండలం అమ్మపాళెం గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌లో డక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి వెళ్తున్నారు. నిండలి గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి నాగరాజు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని నెల్లూరుకు తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

కోట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తిన్నెలపూడికి చెందిన పి.శ్రీనివాసులు మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. శ్రీనివాసులు సోమవారం కోట క్రాస్‌రోడ్డు వద్ద నడిచి వెళుతుండగా మోటార్‌బైక్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెచ్‌ఎంకు సర్టిఫికెట్ అందజేత

దక్కిలి: మండలంలోని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న దూడల పెంచలయ్యకు మంగళవారం రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిషు సౌత్ ఇండియా పంపిన ఇంగ్లిషు సర్టిఫికెట్ కోర్సు ధ్రువీకరణ పత్రాన్ని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు అందజేశారు. విద్యార్థులకు ఇంగ్లిషును సులభంగా బోధించేందుకు కోర్సు ఉపయోగపడుతుందన్నారు. దేశం నుంచి ఒక్కో రాష్ట్రానికి 20మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా అందులో పెంచలయ్య ఉన్నారని చెప్పారు

చెరువులో మృతదేహం

గూడూరు రూరల్ : పట్టణంలోని వాములమిట్టకు చెందిన బిల్లు ప్రశాంత్(31) అనే వ్యక్తి ఈ నెల 26 తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు కుటుంబీకులు 27 తేదీన గూడూరు 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం సంతదాసుపల్లి చెరువులో బిల్లు ప్రశాంత్ మృతదేహంగా కనిపించాడు. డీఎస్పీ గీతాకుమారి పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబీకులు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

రాపూరు: ఆర్టీసీలో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాపూరు ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. రెండవ రోజు మంగళవారం ఆర్టీసీ డిపో ఎదుట ఆ యూనియన్‌కు చెందిన కార్మికులు రిలే నిరాహార దీక్ష చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య, గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్, వెల్డర్ శ్రీధర్, కార్మికులు శాంసన్, పెంచలయ్య, రమణయ్య, మోసే పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కోట: మండల పరిషత్ కార్యాలయం వద్ద మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని మంగళవారం ఎంపీపీ దాసరి అంజమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి కోసం మజ్జిగ, నీళ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పారవోలు మాజీ సర్పంచ్ మృతి


కృష్ణారెడ్డి (ఫైల్)

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పారవోలు మాజీ సర్పంచ్ పుల్లూరు కృష్ణారెడ్డి (71) పారవోలు గ్రామంలో మంగళవారం మృతిచెందారు. పంచాయతీలో 15 సార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. పారవోలు సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడిగానూ సేవలు అందించారు.

పాత వస్తువులకు వేలం

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో పాత వస్తువులకు మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, దశరథరామిరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

జాతర విజయవంతానికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేటటౌన్: గ్రామ దేవత పోలేరమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, నాయకులు, కమిటీ, జాతర నిర్వాహకులు అందరూ సమన్వయంగా పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద మంగళవారం ఆర్డీఓ కిరణ్మయి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, విద్యుత్ శాఖ డీఈ వరప్రసాద్‌రెడ్డి, తహసీల్దారు రాజేంద్ర, అధికారులు, జాతర నిర్వహణ కమిటీతో ప్రత్యేక సమావేశం జరిపారు. మే 6, 7 తేదీల్లో జరిగే జాతర నిర్వహణ తీరుపై పూర్తి వివరాలను అధికారులకు నిర్వాహకులు వివరించారు. వేడుకలను సజావుగా జరిపేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవదాయశాఖ ఈఓ రవికృష్ణ, విన్నమాల గ్రామ పెద్ద అరవభూమి శ్రీనివాసులు రెడ్డి, పోలేరమ్మ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నల్లబోతుల రామారావు, పోలేరమ్మ జాతర కమిటీ అధ్యక్షులు నానబాల సుబ్బారావు పాల్గొన్నారు.

సన్మానం


సర్దార్‌ను సన్మానిస్తున్న దేశినాయక్

రాపూరు: రాపూరు నీటి పారుదలశాఖ ఏఈగా పనిచేస్తున్న సర్దార్‌కు డీఈఈగా పదోన్నతి లభించడంతో స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నెల్లూరు జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ దేశినాయక్ ఆయన సేవలను కొనియాడారు. ప్రభుత్వం గాలేరు నగిరి సుజల స్రవంతి డీఈఈగా నియమించడం అభినందనీయమన్నారు. ఈఈలు మధుసూదన్, బాబురెడ్డి, డీఈఈలు విజయకుమార్, బాబు, కోటేశ్వరావు పాల్గొన్నారు.